# సాక్షి నిజామాబాద్

శుక్రవారం । 25 । అక్టోబర్ । 2024






## అనర్హత వేటు వేయాలి

రాష్ట్రంలో పార్టీలు మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటువేయాలని మాజీ మంత్రి ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అన్నారు.

- IIలో ▸



## న్యాక్ గుర్తింపు కోసం..

తెలంగాణ యూనివర్సిటీకి న్యాక్ గుర్తింపు కోసం అధ్యాపకులు కృషి చేయాలని వీసీ టి యాదగిరిరావు అన్నారు.

- IIలో ▸

గరిష్టం/కనిష్టం
31.9 /19.1

## వాతావరణం

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షం కురియవచ్చు. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరిగే అవకాశాలున్నాయి.

## న్యూస్‌రీల్

### కేటీఆర్‌కు ఘన స్వాగతం



ఇందల్వాయి: ఆదిలాబాద్ జిల్లాకు వెళ్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఇందల్వాయి టోల్‌ప్లాజా వద్ద మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్దన్ నేతృత్వంలో పార్టీ శ్రేణులు గురువారం ఘనస్వాగతం పలికాయి. బాజిరెడ్డి గోవర్దన్, మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, బాజిరెడ్డి జగన్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దాసు, ఐడీసీఎంఎస్ మాజీ చైర్మన్ సాంబారు మోహన్, కుమార్, మాజీ ఎంపీపీలు రమేశ్‌నాయక్, సారికారెడ్డి, నాయకులు హన్మంత్‌రెడ్డి, రఘు తదితరులు కేటీఆర్‌కు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

### 'నిధులు విడుదల చేయండి'



సుభాష్‌నగర్: నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి రావాల్సిన టీయూఎఫ్ఐడీసీ, సీడీపీతోపాటు అభివృద్ధి నిధులను విడుదల చేయాలని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి గురువారం వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. అనంతరం ధన్‌పాల్ మాట్లాడుతూ.. 10 నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు విడుదల గాకపోవడంతో అభివృద్ధి పనులు చేపట్టడంలేదన్నారు. గతంలోనూ ఈ విషయాన్ని సీఎంతో సహా జిల్లా ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకెళ్లానన్నారు. సీఎం స్పందించి వెంటనే టీయూఎఫ్ఐడీసీ, సీడీపీ, ఇతర అభివృద్ధి నిధులు విడుదల చేయాలని కోరారు.

### మత్స్యకారులకు చేప పిల్లల పంపిణీ




జక్రాన్‌పల్లి: మండల కేంద్రంలో గురువారం మత్స్యకారులకు చేప పిల్లలను పంపిణీ చేశారు. జిల్లా మత్స్యశాఖ అధికారి ఆంజనేయస్వామి ఆధ్వర్యంలో మత్స్యకారులకు చేప పిల్లలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేప పిల్లలను సకాలంలో చెరువుల్లో వేసి కాపాడుకోవాలన్నారు. అనంతరం మండలంలోని అన్ని గ్రామాల మత్స్య శాఖ సొసైటీల పరిధిలోని చెరువుల్లో చేప పిల్లలను విడుదల చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్మయి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి, జక్రాన్‌పల్లి మాజీ సర్పంచ్ బాల్‌కిషన్, వసంతరావు, జిల్లా చీఫ్ ప్రమోటర్ శ్రీనివాస్, మండల మత్స్య శాఖ అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రమోటర్ భాస్కర్, ఫీల్డ్ ఆఫీసర్లు కిశోర్, జీవన్, డైరెక్టర్లు శంకర్, గంగాధర్, ఆయా గ్రామాల మత్స్యకారులు పాల్గొన్నారు.

### రైతులకు అండగా ఉంటాం



నిజామాబాద్‌అర్బన్: రైతులకు టీఎస్ఎన్‌పీడీసీఎల్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. సమీకృత కలెక్టరేట్ సమావేశ కార్యాలయంలో గురువారం నిర్వహించిన బహిరంగ విచారణలో వినియోగదారుల ప్రశ్నలకు ఆయన సమాధానలు చెప్పారు. అవినీతి రహిత సమాజం కోసం పనిచేస్తామన్నారు. టోల్ ఫ్రీ నంబర్లను మెరుగుపరిచామని, 40 మంది సిబ్బంది పనిచేస్తుండగా, ఫిర్యాదులపై ఒక టీం పనిచేస్తున్నట్లు తెలిపారు. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు 'పొలంబాట' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా లూస్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, వంగిన పోల్స్‌ను మారుస్తున్నామని వివరించారు. డిచ్‌పల్లి మండలం సుద్దపల్లికి చెందిన బాధితురాలు కమలమ్మ తనకు ఎక్స్‌గ్రేషియా రాలేదని చెప్పడంతో, దానికి కారణాలు వివరిస్తూ వెంటనే రూ.5 లక్షల రూపాయల చెక్కును కమిషనర్, సీఎండీ కలిసి ఆమెకు అందజేశారు.

# రిజిస్ట్రేషన్ల శాఖలో కోల్డ్‌వార్




జిల్లాలోని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సబ్ రిజిస్ట్రార్లు, డాక్యుమెంట్ రైటర్ల మధ్య కోల్డ్ వార్ నడుస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా ఇండ్లు, స్థలాల రిజిస్ట్రేషన్లు చేయాలని రైటర్లు ఒత్తిడి చేస్తున్నారని, ఇందుకు సబ్ రిజిస్ట్రార్లు ససేమిరా అనడంతో ఈ కోల్డ్ వార్‌కు నాంది పలికినట్లు అయ్యిందని జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ విషయమై జిల్లా కేంద్రంలోని డాక్యుమెంట్ రైటర్లు ఇటీవల రహస్యంగా సమావేశం కాగా, ఉన్నతాధికారులకు తెలిసి జోక్యం చేసుకోవడంతో రైటర్లు వెనక్కి తగ్గినట్లు సమాచారం.

- నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు చేయాలని సబ్ రిజిస్ట్రార్లపై డాక్యుమెంట్ రైటర్ల ఒత్తిడి ?
- ససేమిరా అనడంతో ఇరువురి మధ్య పెరిగిన విభేదాలు
- అధికారులు ఎక్కువ డబ్బులు అడుగుతున్నారని ప్రచారం
- ఇటీవల రహస్యంగా సమావేశమైన అర్బన్ డాక్యుమెంట్ రైటర్లు.. ఉన్నతాధికారుల జోక్యంతో వెనక్కి



సుభాష్‌నగర్: జిల్లా కేంద్రంతో పాటు నిజామాబాద్ రూరల్, ఆర్మూర్, బోధన్, భీంగల్‌లలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ఇటీవల జోన్ పరిధిలో సబ్ రిజిస్ట్రార్లు, సీనియర్ అసిస్టెంట్ల బదిలీలు పూర్తిస్థాయిలో జరిగాయి. బదిలీ అయిన వారిలో చాలామంది గ్రూప్–1 పరీక్షల నిమిత్తం సెలవులో వెళ్లారు. దీంతో అధికారులు ఉమ్మడి జిల్లాల్లోని సబ్ రిజిస్ట్రార్లు, సీనియర్ అసిస్టెంట్లకు డిప్యూటేషన్ ఇస్తూ రిజిస్ట్రేషన్ కార్యకలాపాలను నెట్టుకొస్తున్నారు.

**నిబంధనలు పాటించకుంటే చర్యలు..**

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రిజిస్ట్రేషన్ల శాఖలో నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు చేసిన అధికారులను ఇటీవల కాలంలో సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు చేస్తే చర్యలు తప్పవని సబ్ రిజిస్ట్రార్లు, సీనియర్ అసిస్టెంట్లకు ఇప్పటికే ఆదేశాలిచ్చారు. జిల్లాలోనూ నిబంధనల మేరకే రిజిస్ట్రేషన్లు చేస్తుండటంతో డాక్యుమెంట్ రైటర్లకు మింగుడు పడటంలేదు.

**నిబంధనల ప్రకారమే రిజిస్ట్రేషన్లు..**

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిబంధనల ప్రకారమే జిల్లాలో రిజిస్ట్రేషన్లు కొనసాగుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న డాక్యుమెంట్లను రిజిస్ట్రేషన్ చేయాలని డాక్యుమెంట్ రైటర్లు సబ్ రిజిస్ట్రార్లపై ఒత్తిడి చేస్తున్న విషయం నా దృష్టికి వచ్చింది. ఎట్టి పరిస్థితుల్లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించొద్దని ఆదేశాలిచ్చాం. నిబంధనల ప్రకారం ఉన్నప్పటికీ అధికారులు డబ్బులు డిమాండ్ చేస్తే మా దృష్టికి తేవాలని డాక్యుమెంట్ రైటర్లకు సూచించాం.

– ప్రసూన, జిల్లా రిజిస్ట్రార్, నిజామాబాద్

## గతంలో విచ్చలవిడిగా రిజిస్ట్రేషన్లు

నాన్ లే అవుట్ ప్లాట్లు, ఇండ్ల రిజిస్ట్రేషన్ల విషయంలో నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు చేయాలని సబ్ రిజిస్ట్రార్లపై డాక్యుమెంట్ రైటర్లు ఒత్తిడి తెస్తున్నట్లు తెలుసోంది. జిల్లా కేంద్రంతో పాటు భీంగల్, ఆర్మూర్, బోధన్, ఇతర అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ రైటర్లతో ఈ తరహా సమస్య ఎదురవుతున్నట్లు రిజిస్ట్రేషన్ కార్యాలయ సిబ్బంది వాపోతున్నారు. గతంలో ప్రజాప్రతినిధులు, నాయకుల అండదండలతో నాన్ లే అవుట్ ప్లాట్లు, ఇండ్ల రిజిస్ట్రేషన్లు విచ్చలవిడిగా జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. డాక్యుమెంట్ రైటర్లు ప్రజల నుంచి అధికంగా డబ్బులు తీసుకుని నిబంధనలకు విరుద్ధంగా ఉన్న డాక్యుమెంట్లను రిజిస్ట్రేషన్ చేయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ప్రస్తుతం బదిలీలపై వచ్చిన అధికారులు నిబంధనలకు విరుద్ధంగా ఉన్న డాక్యుమెంట్లను రిజెక్ట్ చేస్తున్నారు. దీన్ని జీర్ణించుకోలేకపోతున్న రైటర్లు అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. అంతటితో ఆగకుండా డబ్బులు అధికంగా వసూలు చేస్తున్నారని అధికారులపై ఆరోపణలు చేస్తున్నారు. ఇటీవల డాక్యుమెంట్ రైటర్లు అందరూ రహస్యంగా సమావేశమయ్యారు.

అధికారులను మచ్చిక చేసుకుని రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలని, వారికి ఎదురు తిరిగితే ఇబ్బందులు ఎదురవుతాయనే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం.



మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ శ్రీరంగారావు

# విద్యుత్ చార్జీలు పెంచొద్దు

- కలెక్టరేట్‌లో విద్యుత్ టారిఫ్ పై బహిరంగ విచారణ
- స్థిర చార్జీల్లో స్వల్ప పెంపునకు ప్రతిపాదన
- వ్యతిరేకించిన వినియోగదారులు, ప్రజాప్రతినిధులు

నిజామాబాద్‌అర్బన్: విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనను ప్రజాప్రతినిధులు, వ్యాపారవేత్తలు, వినియోగదారులు వ్యతిరేకించారు. జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో రాష్ట్ర విద్యుత్ ని యంత్రణ మండలి, నా ర్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ ప్రతిపాదించిన ఐదో నియంత్ర ణ కాలానికి సంబంధించి గురువారం బహిరంగ విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ తన్నీరు శ్రీరంగారావు 2024 – 25 సంవత్సరానికి రిటైల్ సరఫరా ప్రతిపాదనలను వివరించారు. ఎల్‌టి వినియోగదారులకు ఎనర్జీ చార్జీలు పెంచలేదన్నారు. ఎక్కువమంది వినియోగదారులకు విద్యుత్ చార్జీల్లో పెరుగుదల లేదన్నారు. రాష్ట్రంలో ఈవీ స్వీకరణను ప్రోత్సహించేందుకు ఎల్‌టీ ఈవీ చార్జింగ్ స్టేషన్లకు స్థి రచార్జీలు పెంచలేదన్నారు. హెచ్‌టీ వినియోగదారులకు స్థిర చార్జీల్లో స్వల్ప పెరుగుదలను ప్రతిపాదించారు. నెలకు 300 యూనిట్ల కంటే ఎక్కువగా వినియోగించే గృహ వినియోగదారులకు స్థిర వ్యయాల పెరుగుదలను వివరించారు. ఎల్‌టీ –1 గృహ వినియోగం 300 యూనిట్ల కంటే ఎక్కువ ఉన్న వినియోగదారులకు స్థిరచార్జీలను 40 రూపాయల చొప్పున పెంచాలని ప్రతిపాదించినట్లు తెలిపారు. ఎనర్జీ చార్జీలను పెంచలేదన్నారు. అన్ని ఓల్టేజీ స్థాయిల కోసం డిమాండ్ చార్జీలను నెలకు రూ.25 చొప్పున పెంచాలని నిర్ణయించినట్లు తెలిపారు.

## ప్రజలపై భారం మోపేందుకు ప్రభుత్వం సిద్ధమైంది : ప్రశాంత్ రెడ్డి



మాట్లాడుతున్న ప్రశాంత్‌రెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం వివిధ కారణాలు చెప్పి రూ.18,500 కోట్ల భారాన్ని ప్రజలపై మోపేందుకు సిద్ధమైందని బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి అన్నారు. బహిరంగ విచారణలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ప్రజలపై భారం పడేలా రాష్ట్రంలో విద్యుత్ చార్జీలను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వ విద్యుత్ కంపెనీలు చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవాలన్నారు. ఇళ్లకు వాడుకు నే కరెంటు నెలకు 300 యూనిట్లు దాటితే కిలోవాట్‌కు ఫిక్స్‌డ్ ఛార్జీని ప్రస్తుతం రూ.10 వసూలు చేస్తుండగా దాన్ని రూ.50కి పెంచాలని డిస్కమ్‌లు కోరడం సరికాదన్నారు. ఉచిత విద్యుత్ భారాన్ని ప్రభుత్వం మధ్య తరగతి, చిన్న పరిశ్రమలు, భారీ పరిశ్రమలపై వేయా లని ఆలోచిస్తోందని ఆరోపించారు. డిస్కంలు ప్రతిపాదించిన 9 ప్రతిపాదనలను తిరస్కరించాలన్నారు. డిస్కంలు చేస్తున్న ప్రతిపాదనల వెనుక ఖచ్చితంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, ట్రాన్స్‌కో అధికారులు పాల్గొన్నారు.



బహిరంగ విచారణకు హాజరైన వినియోగదారులు, ప్రజాప్రతినిధులు

## ఫీల్డ్‌లోకి ఏఈవోలు

- మొదలైన డిజిటల్ క్రాప్ సర్వే

డొంకేశ్వర్(ఆర్మూర్): డిజిటల్ క్రాప్ సర్వే చేపడితే సస్పెన్షన్ ఎత్తివేస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వడంతో ఏఈవోలు సహాయ నిరాకరణను విరమించారు. యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని గురువారం నుంచి క్రాప్ సర్వేను మొదలు పెట్టారు. జిల్లాలో నలుగురు ఏఈవోలు సస్పెన్షన్‌కు గురి కాగా.. వారు కూడా సర్వేలో పాల్గొన్నారు. మొత్తం 107మంది ఏఈవోలు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఫీల్డ్‌లోకి వెళ్లారు. ఏఈవోలతో జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ సమావేశమై సర్వేపై సూచనలు చేశారు. ఎలాంటి సమస్యలున్నా అధికారుల దృష్టికి తేవాలన్నారు. అయితే సాంకేతిక కారణాలతో యాప్‌లో వివరాలు నమోదు కాలేదు. ఫోటో అప్‌లోడ్ కూడా కావడం లేదని ఏఈవోలు పేర్కొంటున్నారు. తమ సమస్యలపై ప్రభుత్వం సానూకూలంగా స్పందించి వెంటనే సస్పెన్షన్ ఎత్తివేయాలని కోరుతున్నారు.



డిజిటల్ క్రాప్ సర్వే చేస్తున్న ఏఈవో

# బదిలీలతో సరి

- తీవ్ర ఆరోపణలున్నా ఉదాసీనవైఖరే..
- విద్యాశాఖ తీరుపై విమర్శలు

నిజామాబాద్‌అర్బన్: మాక్లూర్ కేజీబీవీ ఉద్యోగులపై జిల్లా విద్యాశాఖ ఉదాసీన వైఖరిని ప్రదర్శిస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అక్కడి సిబ్బంది ఒకరిపై మరొకరు అసభ్య ఆరోపణలు చేసుకోవడం, కుమ్ములాటలు చోటు చేసుకుంటున్నప్పటికీ విద్యాశాఖ తీసుకున్న చర్యలను చూసి ఉపాధ్యాయ సంఘాలు ఆశ్చర్యపోతున్నాయి. జిల్లా విద్యాశాఖ ఉదాసీనంగా వ్యవహరించడానికి కారణం అధికార పార్టీ నాయకులు కేజీబీవీ సిబ్బందికి మద్దతుగా నిలవడమేననే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. సిబ్బంది వ్యవహారశైలికి సంబంధించి ఆడియో, వీడియో రికార్డులున్నా అధికారులు కఠిన చర్యలు తీసుకోలేదు. బంగారు గొలుసు చోరీ చేసిందనే అనుమానంతో విద్యార్థినిని మంత్రగాడి వద్దకు తీసుకెళ్లిన టీచర్‌పై ఎలాంటి చర్యలు తీసుకోలేదు.



కేజీబీవీ అధికారి, టీచర్లు ఒకరిపైమరొకరు అసభ్యకరంగా ఆరోపణలు చేసుకున్నారు. ఈ క్రమంలో జిల్లా అధికారిపై కూడా అసభ్యకరమైన ఆరోపణ చేశారు. గత పది రోజులుగా ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. వీటిన్నింటికీ సంబంధించిన ఆడియో, వీడియో రికార్డింగ్‌లు లభ్యమయ్యాయి. ఇంత జరిగినా విద్యాశాఖ వారిని బదిలీ చేసి సరిపెట్టింది. ఈ వ్యవహారంపై స్థానిక మండల అధికారులు, జిల్లా ట్రెయినీ, అదనపు కలెక్టర్లు వేర్వేరుగా విచారణ చేపట్టారు. అంతకుముందు జిల్లా విద్యాశాఖ అధికారి విచారణ చేపట్టగా.. కేజీబీవీ అధికారిణి వ్యవహార శైలిపై విమర్శలు వెల్లువెత్తాయి. టీచర్లు, విద్యార్థులతో అధికారిణి అసభ్యకరంగా మాట్లాడినట్లు విచారణలో తేలింది. విచారణ నివేదిక ప్రకారం అధికారిణిని టర్మినేట్ చేసేందుకు విద్యాశాఖ చర్యలు తీసుకునేందుకు సిద్ధమై రాజకీయ ఒత్తిళ్ల కారణంగా వెనక్కి తగ్గింది. చివరకు బదిలీ చేసి చేతులు దులుపుకున్నది. విద్యార్థినిని మంత్రగాని వద్దకు తీసుకెళ్లిన ఘటనలో సంబంధిత టీచర్ పై అధికారులు చర్యలు తీసుకోలేదు. ఆరోపణలు చేసుకున్న వారిపై చర్యలు తీసుకున్నారు. కాగా సాధారణ బదిలీ అయిన అధికారిణి ఆరోపణలు చేసిన ఒకరికి రిటర్న్ గిఫ్ట్ ఇస్తానంటూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

# ఒకే పోలీస్ విధానం ఉండాలి

- గడ్డి తీయడం, రాళ్లు ఎత్తడమే పోలీస్ ఉద్యోగమా..
- జాతీయ రహదారిపై 7వ బెటాలియన్ పోలీస్ కుటుంబాల సభ్యుల ధర్నా

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్) : రాష్ట్ర వ్యాప్తంగా ఒకే పోలీస్ విధానం ఉండాలని డిచ్‌పల్లి టీజీఎస్‌పీ 7వ పోలీస్ బెటాలియన్‌కు చెందిన కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. గురువారం బెటాలియన్ మెయిన్ గేటు ఎదుట 44వ నెంబరు జాతీయ రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. చంటి పిల్లలను ఎత్తుకుని కానిస్టేబుళ్ల కుటుంబాల సభ్యులు సుమారు రెండు గంటల పాటు ఆందోళనలో పాల్గొన్నారు. దీంతో జాతీయ రహదారిపై వాహనా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. డిచ్‌పల్లి సీఐ మల్లేశ్, ఎస్ఐ ఎండీ షరీఫ్ తమ సిబ్బందితో బెటాలియన్ వద్దకు చేరుకుని ఆందోళనకారులను సముదాయించేందుకు యత్నించారు. జాతీయ రహదారిపై రాస్తారోకో వల్ల ఇబ్బందులు కలుగుతాయని బెటాలియన్ లోనికి వెళ్లి అధికారులతో వారి సమస్యలు చర్చించాలని సూచించారు. అయితే మహిళలు తమ పట్టువీడలేదు. ఈ సందర్భంగా కానిస్టేబుళ్ల కుటుంబాల సభ్యులు మాట్లాడుతూ.. పోలీసు ఉద్యోగమంటే గడ్డి తీయడం, రాళ్లు ఎత్తడమేనా అని ప్రశ్నించారు. తమ భర్తలు 8 గంటలకు మించి పని చేయటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, బెటాలియన్ పోలీసులకు ఐదేళ్ల ఒకే దగ్గర పోస్టింగ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. టీజీఎస్పీ బెటాలియన్స్‌కు చెందిన పోలీసులు వెట్టిచాకిరి చేస్తున్నారని, ఇటీవల మారిన విధినిర్వహణలో భాగంగా నెలలో 4 రోజులు మాత్రమే ఇంటికి వస్తున్నారన్నారు. ఆ సమయంలో పిల్లలు తమ తండ్రిని కూడా గుర్తుపట్టలేని స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు నెలలకోకసారి పోస్టింగ్‌లు మార్చటంతో పిల్లల చదువులకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం శాంతి భద్రతలు కాపాడే పోలీస్ వ్యవస్థలో ఏక్ పోలీస్ విధానాన్ని అనుసరించడం లేదని విమర్శించారు. బెటాలియన్ కానిస్టేబుళ్ల కుటుంబాల ఇబ్బందులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వాపోయారు. విధి నిర్వహణ పేరుతో ప్రభుత్వం వారిని కుటుంబాలకు దూరం చేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆందోళనకారులు పట్టువీడక పోవడంతో జిల్లా అడిషనల్ ఎస్పీ (లా అండ్ ఆర్డర్) బస్వారెడ్డి బెటాలియన్ వద్దకు చేరుకున్నారు. వారిని ఆందోళన విరమించాలని సముదాయించారు. అయితే ఆందోళనకారులు తమ పట్టువీడక పోవడంతో ఆయన అసహనం వ్యక్తం చేశారు. అదే సమయంలో అక్కడకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాన్వాయ్ చేరుకుంది. పోలీసులు కాన్వాయ్ వెళ్లేందుకు దారి ఏర్పాటు చేసినప్పటికీ కేటీఆర్ వాహనాన్ని నిలిపివేయించి ఆందోళనకారుల వద్దకు చేరుకుని వారి నిరసన కు సంఘీభావం తెలియజేశారు. వారితో మాట్లాడి ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంట్ ఎంఐ సురేశ్ ను పిలిచి మాట్లాడారు. సమస్యను పరిష్కరించేలా చూడాలని సూచించారు. కేటీఆర్ వెళ్లిన తర్వాత కూడా కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు తమ నిరసన కొనసాగించడంతో పోలీసు అధికారులు మహిళా కానిస్టేబుళ్ల సాయంతో వారిని బలవంతంగా రహదారి పక్కకు తీసుకెళ్లారు. బెటాలియన్ సమావేశంహాల్ కు వెళ్లి మాట్లాడుకుందామని ఇన్‌చార్జి కమాండెంట్ విన్నవించినా వారు రోడ్డుపక్కనే మరికొంత సేపు తమ ధర్నా కొనసాగించారు. చివరకు ప్రభుత్వం 26న బెటాలియన్ కానిస్టేబుళ్ల సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకోనుందని అధికారులు నచ్చచెప్పడంతో ఆందోళన విరమించారు.

### ఉన్నతాధికారుల ఆరా..

రాష్ట్రవ్యాప్తంగా ఒకే పోలీసింగ్ విధానం అమలు చేయాలని కోరుతూ రోడ్డుపై నిరసన తెలిపిన కానిస్టేబుల్ కుటుంబాల సభ్యులపై పోలీస్ ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు పలు ఫొటోలు, వీడియోల ఆధారంగా ఇంటలిజెన్స్, స్పెషల్ బ్రాంచి సిబ్బంది వివరాలు సేకరిస్తున్నారు.



కానిస్టేబుల్ భార్యను జీపులో తరలిస్తున్న పోలీసులు



జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న ఏడో బెటాలియన్ కానిస్టేబుళ్ల కుటుంబాల సభ్యులు

## క్లుప్తంగా

### మత్తుకు దూరంగా ఉండాలి



బోధన్: విద్యార్థులు, యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని యాంటీ నార్కోటిక్ బ్యూరో ఏసీపీ సోమనాథం అన్నారు. మత్తు పదార్థాలకు బానిసైన ఎంతో మంది యువకులు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు కళ్ల ముందు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. గురువారం పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యాంటీ నార్కోటిక్ బ్యూరో ఆధ్వర్యంలో మత్తు పదార్థాల నియంత్రణ అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. చెడు వ్యసనాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని విద్యార్థులకు సూచించారు. మత్తు పదార్థాల నియంత్రణకు ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. యాంటి నార్కోటిక్ బ్యూరో సీఐ పూర్ణేశ్వర్, పట్టణ సీఐ వెంకట నారాయణ, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### నాణ్యమైన విద్యను అందించాలి

నిజామాబాద్అర్బన్: ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని డీఈవో దుర్గాప్రసాద్ గురువారం పేర్కొన్నారు. జిల్లాలోని ఉన్నతపాఠశాల హెచ్ఎంలకు గురువారం ఆర్‌బీవీఆర్ఆర్ పాఠశాలలో ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి డీఈవో హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. గ్రంథాలయ వినియోగం పాఠశాలలో తప్పనిసరిగా చేపట్టాలన్నారు. సెలవు, నిబంధనలు పాఠశాలలో రికార్డులపై హెచ్ఎంలు, ఎంఈవోలకు వివరించారు. వివిధ రకాల వెబ్‌సైట్‌ల నిర్వహణ, ట్రెజరీ బిల్లుల తయారీపై వివరించారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్నాగారం: జిల్లా కేంద్రంలోని ఈజేహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్‌లో రెండు ఎంబీబీఎస్ డాక్టర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సెంటర్ ఇన్‌చార్జి మెడికల్ ఆఫీసర్ కృష్ణవేణి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం నుంచి నవంబర్ 2 సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను నగరంలోని పాత మున్సిపల్ కార్యాలయ సమీపంలోని వెల్‌నెస్ సెంటర్‌లో అందజేయాలని కోరారు.

### కొనసాగుతున్న క్రీడా పోటీలు



జక్రాన్‌పల్లి: మండలంలోని మునిపల్లిలో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే బీసీ వెల్ఫేర్ బాలికల డిగ్రీ కళాశాలలో అంతర పాఠశాలల క్రీడా పోటీలు కొనసాగుతున్నాయి. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని పది పాఠశాలల నుంచి వివిధ జట్లు పాల్గొంటున్నాయి. జట్ల మధ్య పోటీలు రసవత్తరంగా కొనసాగుతున్నాయి. కళాశాల ఆర్‌సీవో సత్యనాథ్, ప్రిన్సిపాల్ అనూష పోటీలను పర్యవేక్షించారు. పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

### 28న నిధి ఆప్కే నికట్

నిజామాబాద్ రూరల్: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 28న నిధి ఆప్కే నికట్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిజామాబాద్ రీజియన్ పీఎఫ్ కమిషనర్ గణేశ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మాణిక్‌బండార్‌లో ఉన్న కాకతీయ ఉమన్స్ కాలేజీలో, కామారెడ్డి జిల్లాలోని ఆర్‌కే డిగ్రీ కళాశాలలో ఈ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణలు కార్యక్రమాలు కొనసాగుతాయని అన్నారు. అదే విధంగా ప్రావిడెంట్ ఫండ్ చందాదారులు, యజమానులు, పెన్షనర్లు తగిన ఆధారాలతో కార్యక్రమానికి హాజరై తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. ఫిర్యాదులను అక్కడికక్కడే పరిష్కరిస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# కృత్రిమ గర్భధారణతో పశుసంపద వృద్ధి

- 90 శాతం కచ్చితత్వంతో మేలు జాతి ఆడ దూడల పునరుత్పత్తికి సాంకేతికత
- సబ్సిడీతో లింగ నిర్ధారిత వీర్య నాళికలను అందిస్తున్న ప్రభుత్వం



పిప్రిలో కృత్రిమ గర్భధారణ చేస్తున్న వైద్యురాలు

ఆర్మూర్: పాడి రైతులు తాము పెంచుకొనే బర్రె, ఆవుకు ఆడ దూడనే పుట్టాలి.. మగ దూడ(పోతు) పుట్టొద్దని అనుకుంటున్నారా..? అలాంటి పాడి రైతుల కోసమే పశు వైద్యుల వద్ద లింగ నిర్ధారిత వీర్యం(సెక్స్ సార్టెడ్ సిమన్) అందుబాటులో ఉంది. దీనితో ఎదలోకి వచ్చిన పశువుకు కృత్రిమ గర్భధారణ చేయిస్తే 90 శాతం కచ్చితత్వంతో అధిక పాల దిగుబడి సామర్థ్యం గల మేలు జాతి ఆడ దూడలు పుట్టించే సాంకేతికత అందుబాటులోకి వచ్చింది. అమెరికా వ్యవసాయ శాఖ వారు మొదటగా కనుగొన్న ఈ నూతన సాంకేతికతను ప్రస్తుతం మన ప్రభుత్వం రాష్ట్రీయ గోకుల్ మిషన్ సహకారంతో సబ్సిడీపై అందిస్తూ పాడి రైతులకు అందుబాటులోకి తెచ్చింది. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకం రాష్ట్రీయ గోకుల్ మిషన్ సహకారంతో తెలంగాణ పశుగణాభివృద్ధి సంస్థ ద్వారా అన్ని మండల ప్రాథమిక పశువైద్య కేంద్రాల్లో, పశు వైద్య ఉపకేంద్రాల్లో, గోపాలమిత్ర సెంటర్లలో లింగ నిర్ధారిత వీర్య నాళికలు అందుబాటులో ఉన్నాయి. పాడి రైతులు వారి పాడి పశువు ఎదకు వచ్చినప్పుడు సరైన సమయంలో దగ్గరలోని కృత్రిమ గర్భధారణ నిపుణులను సంప్రదించాల్సి ఉంటుంది.

పశు వైద్యులు పశువు చెవిపోగు నంబరు, ఇతర వివరాలు నమోదు చేసుకుని లింగ నిర్ధారిత వీర్యంతో కృతిమ గర్భధారణ చేస్తారు. కృత్రిమ గర్భధారణ చేసిన తర్వాత ఉపయోగించిన లింగ నిర్ధారిత వీర్య నాళికలను రైతుకు భరోసా కొరకు అందజేస్తారు. అవసరమైతే వీర్య నాళికలపై గల నంబర్ సహాయంతో రైతు ఈ గోపాల యాప్‌లో రైతు సరిచూసుకోవచ్చు. కృత్రిమ గర్భధారణ చేసిన 90 రోజుల తర్వాత చూడి పరీక్ష చేయించాల్సి ఉంటుంది. దూడపుట్టిన 15 రోజులలోపు కృత్రిమ గర్భధారణ నిపుణునికి వివరాలు అందించాలి.

ఒక లింగ నిర్ధారిత వీర్య నాళిక ధర రూ.675 కాగా ప్రభుత్వం రూ.425 సబ్సిడీతో అందిస్తోంది. దీంతో రైతులు కేవలం రూ.250 మాత్రమే చెల్లించి తమ పశువులకు కృత్రిమ గర్భదారణ చేయించుకోవచ్చు. కృత్రిమ గర్భధారణ చేయించిన తర్వాత పశువు చూలు కట్టకపోతే మరోసారి ఎదలోకి వచ్చినప్పుడు మళ్లీ కృతిమ గర్భధారణ చేయించాల్సి ఉంటుంది.

ఒకవేళ రైతు రెండు సార్లు కృత్రిమ గర్భధారణ చేయించినా పశువు చూలు (గర్భం) కట్టకపోతే. రైతు రెండు సార్లు చెల్లించిన వాటాధనం రూ.500 తిరిగి రైతు బ్యాంక్ అకౌంట్‌కి తెలంగాణ పశుగణాభివృద్ధి సంస్థ జమ చేస్తుంది.

### గతంలో 50 శాతమే..

గతంలో పశువుల్లో కృత్రిమ గర్భధారణకు వినియోగిస్తున్న సాధారణ వీర్య నాళికల ద్వారా 50 శాతం వరకు మాత్రమే ఆడదూడలు పుట్టే అవకాశం ఉండేది. ప్రస్తుతం లింగ నిర్ధారిత వీర్యం ఉపయోగించి కృత్రిమ గర్భధారణ చేయిస్తే 90 శాతం కంటే ఎక్కువ మేలు జాతి ఆడదూడలు పుట్టే అవకాశం ఉంది. అంతేకాకుండా పాడి రైతులు మగ దూడల నిర్వహణ భారం నుంచి సులువుగా తప్పించుకోవచ్చు. బర్రెలలో అయితే ముర్రా జాతి, ఆవులలో అయితే సాహివాల్, హెచ్ఎఫ్, జెర్సీ సంకరజాతులకు సంబంధించిన వీర్యం పశువైద్యశాలల్లో అందుబాటులో ఉంది.

### ఆరోగ్యవంతమైన పశువులను తీసుకురావాలి



నాలుగు ఈతల లోపు, ఎటువంటి గర్భకోశ వ్యాధులు లేని క్రమం తప్పకుండా ఎదకు వచ్చే ఆరోగ్యవంతమైన పశువులలో కట్టు శాతం ఎక్కువ కాబట్టి పాడి రైతులు ఇలాంటి పశువులకే లింగ నిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భధారణ చేయించాలి. మరిన్ని వివరాలకు దగ్గరలో ఉన్న ప్రాథమిక పశు వైద్య కేంద్రాలను, పశువైద్య ఉపకేంద్రాలను, గోపాల మిత్రులను సంప్రదించాలి. – శైలజ, పశువైద్యాధికారి, పిప్రి

# యూనివర్సిటీ న్యాక్ గుర్తింపునకు సిద్ధం కావాలి

**తెయూ వీసీ యాదగిరిరావు**



వివిధ విభాగాధిపతులతో మాట్లాడుతున్న వీసీ

తెయూ(డిచ్‌పల్లి): ఉన్నత విద్యాసంస్థలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఆర్థికపరమైన మద్దతుకు న్యాక్ అక్రిడియేషన్ తప్పనిసరి అని తెలంగాణ యూనివర్సిటీ వీసీ టి యాదగిరిరావు పేర్కొన్నారు. గురువారం తెయూ పరిపాలనా భవనంలోని ఎగ్జిక్యూటివ్ హాల్‌లో వివిధ విభాగాధిపతులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. వర్సిటీల్లో మౌలిక వసతుల కల్పనకు, బోధన సిబ్బంది, పరిశోధకులకు అవసరమైన ప్రాజెక్టుల నిర్వహణకు, ల్యాబ్‌ల ఏర్పాట్లకు విద్యార్థుల ఫెలోషిప్‌లకు న్యాక్ గుర్తింపు అనివార్యంగా మారిందని, ఈ విషయాన్ని అందరూ గుర్తించాలన్నారు. న్యాక్ గుర్తింపుతోనే వర్సిటీలకు భవన నిర్మాణ గ్రాంట్లతో పాటు మౌలిక వసతుల నిర్మాణానికి అవసరమైన ఆర్థిక మద్దతు లభిస్తుందన్నారు. ప్రధానంగా ఐక్యూఏసీ రూపకల్పన గురించి సమగ్రంగా విభాగాధిపతులకు అవగాహన కల్పించారు. రిజిస్ట్రార్ యాదగిరి మాట్లాడుతూ.. అధ్యాపకులు వర్సిటీ అభివృద్ధిలో భాగం పంచుకుని ఉన్నతమైన న్యాక్ గ్రేడ్ సాధనకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ ఆరతి, ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్, కంట్రోలర్ ఎం అరుణ, ఐక్యూఏసీ డైరెక్టర్ ఎ నాగరాజు, వివిధ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

### విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



బోధన తీరును తెలుసుకుంటున్న వీసీ

తెయూ(డిచ్‌పల్లి): విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని తెలంగాణ యూనివర్సిటీ వీసీ టి యాదగిరిరావు హెచ్చరించారు. తెయూ మెయిన్ క్యాంపస్‌లోని పలు విభాగాలను రిజిస్ట్రార్ ఎం యాదగిరితో కలిసి గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఆయా విభాగాల్లో, తరగతి గదుల్లో బోధన జరుగుతున్న తీరును పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతం మెరుగుపడేలా కృషి చేయాలని విభాగాధిపతులకు సూచించారు. అధ్యాపకులు సమయపాలన పాటించాలని, అనుమతితో మాత్రమే సెలవులు వాడుకోవాలని ఆదేశించా రు. తనిఖీల్లో వీసీ వెంట కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ ఆరతి, వైస్ ప్రిన్సిపల్ ఎం సత్యనారాయణరెడ్డి, వివిధ విభాగాధిపతులు ఉన్నారు.

# 2న శ్రీక్షేత్రం కపిల్‌ధార్ మన్మథస్వామి పాదయాత్ర



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్

బోధన్: వీరశైవుల ఆరాధ్యదైవం మహారాష్ట్ర ప్రాంతంలోని బీడ్ జిల్లాలో కొలువైన శ్రీ క్షేత్రం మన్మథ స్వామి పుణ్యక్షేత్రం దర్శనానికి నవంబర్ 2న బోధన్‌లో పాదయాత్ర ప్రారంభం కానుంది. ఈ యాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్లు, కరపత్రాలను గురువారం పట్టణ కేంద్రంలో వేర్వేరుగా వీరశైవ లింగాయత్ సమాజ్ జిల్లా అధ్యక్షుడు వీఆర్‌దేశాయ్, జిల్లా కోర్టు ఇన్‌చార్జి పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్యాంరావు, లింగాయత్, జంగమ సమాజ్ పట్టణ ప్రతినిధులు ఆవిష్కరించారు. పట్టణ కేంద్రం నుంచి పుణ్యక్షేత్రం సుమారు 350 కిలో మీటర్ల దూరం ఉంటుంది. 15 రోజుల పాటు ఈ పాదయాత్ర కొనసాగనుంది. తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల భక్తులు వీరశైవులు వేలాది మంది దర్శనం కోసం కాలినడకన వెళ్తారు. ఈ సందర్భంగా వీరశైవ లింగాయత్, జంగమ సమాజ్ ప్రతినిధులు మాట్లాడుతూ.. పట్టణ కేంద్రంలోని జంగం గల్లీలో ఉన్న పురాణే మఠం నుంచి పాదయాత్ర ప్రారంభమై ఏకచక్రేశ్వరాలయాన్ని దర్శించుకుని బయలు దేరుతుందని, నవంబర్ 15న శ్రీక్షేత్రం కపిలధార్ మన్మథ స్వామి పుణ్యక్షేత్రానికి చేరుకుంటుందని తెలిపారు. సమాజ్ ప్రతినిధులు నర్సింగ్ అప్ప, రాజేందర్ కుమార్ అప్ప, యాదవ్‌రావు పటేల్, అజయ్‌కుమార్, దిలీప్‌కుమార్, శివప్రసాద్ పాల్గొన్నారు.

# భార్య నుంచి తన ఆస్తులు ఇప్పించాలని ఆందోళన



సుర్బిర్యాల్‌లో ఆందోళన చేస్తున్న మోహన్ గౌడ్, కుటుంబ సభ్యులు

పెర్కిట్: వరకట్నం కేసుతో తన ఆస్తులు రాయించుకున్న భార్య నుంచి తిరిగి ఇప్పించాలని ఆర్మూర్ మండలం గోవింద్‌పేట్‌కు చెందిన మోహన్‌గౌడ్ కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళనకు దిగాడు. వివరాలిలా ఉన్నాయి. గోవింద్‌పేట్‌కు చెందిన మోహన్‌గౌడ్‌కు ఆర్మూర్‌కు చెందిన మహిళతో పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. 2016లో మహిళ తన భర్తతో పాటు కుటుంబ సభ్యులపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసింది. కేసును విత్ డ్రా చేసుకోడానికి భర్త మోహన్‌గౌడ్‌కు సంబంధించిన ఆస్తులను తన పేరిట రాయించుకుంది. అనంతరం భర్తను దుబాయికి పంపించింది. ఇటీవల తిరిగి వచ్చిన భర్తకు తన భార్య ఇతర వ్యక్తితో సహజీవనం చేస్తోందని తెలిసింది. దీంతో గురువారం మోహన్‌గౌడ్ తన భార్య సహజీవనం చేస్తున్న సుర్బిర్యాల్‌కు చెందిన వ్యక్తి ఇంటి ఎదుట కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళనకు దిగాడు. భార్య నుంచి తన ఆస్తులు తనకు ఇప్పించాలని, అలాగే భార్య సహజీవనం చేస్తున్న వ్యక్తి నుంచి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

## పార్టీ మారిన వారిపై అనర్హత వేటు వేయాలి



నిజామాబాద్అర్బన్: రాష్ట్రంలో పార్టీలు మారిన ఎమ్మెల్యేలు, మంత్రులపై అనర్హత వేటువేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అన్నారు. గురువారం కలెక్టరేట్ ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్ స్పీకర్ ప్రసాద్ కుమార్, కౌన్సిల్ చైర్మన్ గుత్త సుఖేందర్ రెడ్డి ఆ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యానికి రూ. 500 బోనస్ ఇస్తామని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు దానిని ఎగ్గొట్టేందుకు కుట్ర చేస్తోందని అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

### నేడు, రేపు ఇంటర్ కాలేజీ సెలెక్షన్స్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఇంటర్ కాలేజ్ బాడ్మింటన్(మెన్) సెలెక్షన్స్ శుక్రవారం ఉదయం క్యాంపస్‌లోని క్రీడా మైదానంలో, 26న శనివారం ఉదయం కబడ్డీ(మెన్) సెలెక్షన్స్ నిర్వహిస్తామని వర్సిటీ స్పోర్ట్స్ డైరెక్టర్ జి బాలకిషన్ గురువారం పేర్కొన్నారు. క్రీడాకారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### విచారణ చేపడుతున్నాం

నిజామాబాద్అర్బన్: సెలవుల్లో ఉండి వేతనం పొందిన ఘటనపై విచారణ చేపడుతున్నామని డీఈవో దుర్గాప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ సెలవులో ఉండగా మూడు నెలల వేతనం పొందడంపై సంబంధిత సిబ్బంది, అధికారులతో విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

## మెడికల్ కళాశాలకు భౌతికకాయం అప్పగింత



భౌతిక కాయాన్ని అప్పగిస్తున్న కుటుంబీకులు

నిజామాబాద్నాగారం: కోటగిరి మండల కేంద్రానికి చెందిన నర్రా పూర్ణచంద్రారావు గురువారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన భౌతికకాయం విద్యార్థులకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో కుమార్తె పద్మజ, కుమారుడు శ్రీనివాసు ప్రగతిశీల యువజన సంఘం, మానవ హక్కుల వేదిక సంఘాల ఆధ్వర్యంలో మెడికల్ కళాశాలకు భౌతికకాయాన్ని గురువారం అప్పగించారు. ప్రగతిశీల యువజన సంఘం నాయకులు వనమాల సత్యం, పూర్వ నాయకులు నీలం సాయిబాబా, డి మల్లికార్జున్, మానవ హక్కుల వేదిక నాయకురాలు, వేములపల్లి అరుణ రేఖ పాల్గొన్నారు.

### భర్తకు తలకొరివి పెట్టిన భార్య

మాచారెడ్డి: అనారోగ్యంతో మృతి చెందిన భర్తకు ఓ భార్య తలకొరివి పెట్టిన ఘటన మాచారెడ్డి మండలంలోని చుక్కాపూర్‌లో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఇసాయిపేట మైసయ్య(50)అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. మృతుడికి సంతానం లేకపోవడంతో భార్య లక్ష్మి తలకొరివి పెట్టింది.

## క్రైం కార్నర్

# వేర్వేరు ఘటనల్లో ముగ్గురి మృతి

**ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో బుధ, గురువారాల్లో జరిగిన వేర్వేరు ఘటనల్లో ముగ్గురు మృతి చెందారు. బాత్‌రూమ్‌లో జారిపడి ఒకరు, కాలకృత్యాలు తీర్చుకోవడానికి చెరువులో పడి మరొకరు, బస్ షెల్టర్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు వివరాలు సేకరించారు.**



శ్రీనివాస్ మృతదేహం

ఖలీల్‌వాడి: బాత్‌రూమ్‌కు వెళ్తుండగా ఓ వ్యక్తి కాలుజారి పక్కనే ఉన్న బండలపై పడి మృతి చెందిన జిల్లా కేంద్రంలోని ఆనంద్‌నగర్‌లో చోటు చేసుకుంది. ఐదో టౌన్ ఎస్సై గంగాధర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆనంద్‌నగర్‌కు చెందిన కుర్రె శ్రీనివాస్(50) నాలుగేళ్ల క్రితం భార్యతో విడాకులు తీసుకొని ఒంటరిగా నివాసం ఉంటున్నాడు. గురువారం మధ్యాహ్నం బాత్‌రూమ్‌కు వెళ్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి పక్కనే ఉన్న బండలపై పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

**కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లి ఒకరు..**



నారాయణ(ఫైల్)

ఎడపల్లి: కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందిన ఘటన ఎడపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై వంశీధర్‌రెడ్డి గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఉడుత నారాయణ(43) జిల్లా కేంద్రంలో ఫ్రిడ్జ్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం ఇంటి నుంచి కాలకృత్యాలు తీర్చుకునేందుకు మండల కేంద్రంలోని పులి చెరువు వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలుజారి అందులో పడడంతో మృతి చెందాడు. చెరువులో మృతదేహం ఉందన్న సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి పంచనామ నిర్వహించారు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

### గుర్తు తెలియని వ్యక్తి..

కామారెడ్డి క్రైం: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని నర్సన్నపల్లి బస్‌షెల్టర్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. గురువారం బస్‌షెల్టర్‌లో ఓ వ్యక్తి మృతదేహం ఉన్నట్లు స్థానికులు సమాచారం ఇవ్వడంతో దేవునిపల్లి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. తెల్లని గడ్డం, నలుపు రంగు షర్ట్, బూడిద రంగు ప్యాంటు కలిగి ఉన్నాడు. మృతుడి వయస్సు 40–45 ఏళ్ల మధ్య ఉంటాని ఎస్సై రాజు తెలిపారు. అనారోగ్య కారణాలతో మృతి చెందినట్లు భావిస్తున్నారు. మృతుడి ఆచూకీ ఎవరికైనా తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

## ఒంటరి జీవితం భరించలేక ఒకరి ఆత్మహత్య

ఖలీల్‌వాడి: ఒంటరి జీవితం భరించలేక ఒకరు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన జానకంపేట్‌లో చోటు చేసుకుంది. రైల్వే ఎస్సై సాయిరెడ్డి గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని నిజాం కాలనీకి చెందిన ముజీబ్‌బేగ్(26) భార్య మూడేళ్ల క్రితం మృతి చెందింది. తల్లిదండ్రులు, పిల్లలు ఎవరూ లేకపోవడంతో నాటి నుంచి ఒంటరిగానే బతుకుతున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసగా మారాడు. దీంతో జీవితంపై విరక్తితో జానకంపేట్ రైల్వేస్టేషన్ వద్ద గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

**బావిలో పడి మరొకరు..**

తాడ్వాయి: కుటుంబ కలహాలతో ఒకరు చేద బావిలో పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన తాడ్వాయి మండలంలోని నందివాడలో చోటు చేసుకుంది. పోలీసులు గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. నందివాడకు చెందిన ముక్కు సాయికుమార్(25)కు, మద్దికుంటకు చెందిన అఖిలతో మూడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. సంసార విషయంలో వీరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో జీవితంపై విరక్తితో సాయికుమార్ బుధవారం బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి బూదవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

## భూమి కోసం ఇరు గ్రామాల ఘర్షణ



ఘర్షణ పడుతున్న తండాల వాసులు

గాంధారి: అటవీ భూమీ కోసం మండల పరిధిలోని గౌరారం, వెంకటాపూర్ తండా వాసులు గురువారం ఘర్షణపడి పరస్పర దాడులు చేసుకున్నారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ సతీశ్‌రెడ్డి, ఎస్సై ఆంజనేయులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అధికారులు వెళ్లే సరికి ఘర్షణ సద్దు మణిగింది. వివరాలిలా ఉన్నాయి. గౌరారం శివారులో అటవీ భూమిని పలువురు ఆక్రమించి సాగుచేస్తున్నారని ఆరోపిస్తూ అటవీ భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేస్తూ గౌరారం గ్రామస్తులు ఫారెస్టు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేసి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. స్పందించిన అధికారులు మూడు రోజులుగా ఫారెస్టు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా సర్వే చేస్తున్నారు. గురువారం సర్వే పూర్తి కావడంతో భూమిని ఆక్రమించుకున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న వెంకటాపూర్ తండాకు చెందిన ఓ కుటుంబ సభ్యులు, గౌరారం గ్రామస్తులపై దురుసుగ ప్రవర్తించడంతో మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. ఇరు గ్రామాల వారు ఒకరినొకరు నెట్టుకుని గల్లాలు పట్టుకునే వరకు వెళ్లింది. మధ్యవర్తులు నచ్చచెప్పడంతో ఘర్షణ సద్దుమణిగింది. ఈ విషయమై తహసీల్దార్ సతీశ్‌రెడ్డిని సంప్రదించగా సర్వే పూర్తయిందని, సర్వే రిపోర్టులు ఎల్లారెడ్డి ఆర్డీవోకు అప్పగిస్తామన్నారు. పైఅధికారుల నిర్ణయం మేరకు చర్యలు తీసకుంటామని పేర్కొన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్ కాయిల్స్ చోరీ



ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

వర్ని: చందూర్ మండల కేంద్రంతో పాటు ఘన్పూర్ శివారులో వ్యవసాయ విద్యుత్ సరఫరా కోసం ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లను దుండగులు ధ్వంసం చేసి కాపర్ వైర్లను దొంగిలించారు. గురువారం తెల్లవారుజామున చందూర్ శివారులో రెండు, ఘనపూర్ శివారులో ఒక ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కాపర్ వైర్లు, కాయిల్స్ చోరీకి గురైనట్లు సంబంధిత రైతులు విద్యుత్ శాఖ ఏఈ గోపికి సమాచారం అందించారు. అనంతరం ఏఈ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

**బడాభీమ్‌గల్‌లో రెండిళ్లలో ..**

మోర్తాడ్: భీమ్‌గల్ మండలం బడాభీమ్‌గల్‌లో బుధవారం అర్ధరాత్రి దుండగులు రెండు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. ప్రభాకర్, ముకేశ్ అనే ఇదరు అన్నాదమ్ముళ్ల ఇళ్ల తాళాలను దుండగులు పగులగొట్టి 5 తులాల బంగారం, పది తులాల వెండి, రూ. 20 వేల నగదును దొంగిలించారు. దుండగులు ప్రభాకర్, ముకేశ్ ఉన్న పక్క ఇళ్లకు గొల్లాలు పెట్టి చోరీకి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు భీమ్‌గల్ పోలీసులు తెలిపారు.

### పగలు రెక్కీ.. రాత్రి దొంగతనం

మోర్తాడ్: మండల కేంద్రంలోని ఓ ఇంట్లో దుండగులు పగలు రెక్కీ నిర్వహించి రాత్రి చోరీకి పాల్పడినట్లు ఎస్సై విక్రమ్ గురువారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన ఆరేటి వినయ్ ఇంటికి మంగళవారం తాళం ఉండటంతో గమనించిన దుండగులు ప్లాన్ ప్రకారం ముఖానికి మాస్కులు ధరించి ఇంట్లో సీసీ కెమెరాల వైర్లను కట్ చేశారు. అనంతరం ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లో ఉన్న నగదు, బంగారాన్ని చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. చోరీ తీరును పరిశీలిస్తే తెలిసిన వారే చోరీకి పాల్పడి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నిందితులను గుర్తించేందుకు ఇతర చోట్ల ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

### కారుపై విరిగి పడ్డ చెట్టు కొమ్మ



కారుపై పడ్డ చెట్టు కొమ్మను తొలగించిన స్థానికులు

ఎల్లారెడ్డి: పట్టణంలోని పెద్ద చెరువు కట్ట వద్ద హైదరాబాద్‌కు వెళ్తున్న ఓ కారుపై చెట్టు కొమ్మ విరిగి పడడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డి పెద్ద చెరువు కట్టపై రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా చెట్లను నరికి వేస్తున్నారు. చెట్లను నరుకుతున్న సమయంలో ఓ కొమ్మ హైదరాబాద్ వైపు వెళ్తున్న కారుపై పడింది. ఈ ఘటనలో కారు అద్దాలు ధ్వంసం కాగా అందులో ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. చెట్లను నరుకుతున్న సమయంలో సంబంధిత కాంట్రాక్టర్ తగు చర్యలు తీసుకోకపోవడం వల్లే ఇలా జరిగిందని స్థానికులు పేర్కొన్నారు.

### మొరం టిప్పర్‌కు జరిమానా

మోపాల్: మండలంలో అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్న టిప్పర్‌ను భూగర్భ గనులశాఖ అధికారులు గురువారం పట్టుకున్నారు. అక్రమంగా మొరం తరలిస్తున్నారనే ఫిర్యాదుల మేరకు అధికారులు తనిఖీలు చేపట్టారు. పట్టుకున్న టిప్పర్‌కు రూ.2వేలు జరిమానా విధించారు.

### గుట్కా ప్యాకెట్లు పట్టివేత

బోధన్‌రూరల్: మహారాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో సాలూర మండల కేంద్రంలోని అంత్రరాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద నిర్వహిస్తున్న తనిఖీల్లో బుధవారం రాత్రి రూ.10,080 విలువ చేసే గుట్కా ప్యాకెట్లను పట్టుకొని సీజ్ చేసినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి గురువారం పేర్కొన్నారు. బైక్‌పై గుట్కాను బ్యాగ్‌లో తరలిస్తుండగా తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులను చూసి బైక్‌ను, గుట్కా బ్యాగ్‌ను వదిలేసి అక్కడి నుంచి పారిపోయాడు. గుట్కా బ్యాగ్‌ను స్వాధీనం చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

### పేకాట స్థావరాలపై దాడి

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని వడ్లం గ్రామంలో పేకాట స్థావరాలపై బుధవారం అర్ధరాత్రి దాడి చేసినట్లు ఎస్సై మహేందర్ గురువారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని పలుచోట్ల పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో పేకాట స్థావరాలపై దాడులు చేశామని అందులో 8 మందిని పట్టుకొని వారి నుంచి రూ. 30వేల నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా పేకా ట ఆడితే కఠిన చర్యలు తీసుకొని కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.



● పుప్పొడి నేత

# పరాగ మంజరి

పూల అందాలను చూసి మైమరచిపోవడం మనకు తెలిసిందే!
వాటిలో దాగున్న పరాగ రేణువుల అందం చూస్తే... ప్రకృతి ఒడిలో మనకు తెలియని ఇన్ని అద్భుతాలు దాగున్నాయా అని ఆశ్చర్యపోవాల్సిందే!
అత్యంత సంక్లిష్టంగా ఉండే ఆ పరాగ రేణువుల నిర్మాణపు అందాన్ని చూడటమే కాదు, వాటిని టెక్స్‌టైల్ డిజైన్స్‌లో తీసుకురావడానికి ప్రయత్నం చేస్తున్నది హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్శిటీ ఎమ్మెస్సీ విద్యార్థిని శివాని నేత చిలుకూరి.
అత్యంత సూక్ష్మంగా కనిపించే ఈ అద్భుతాలను 'పరాగ మంజరి'గా మనకు పరిచయం చేస్తున్నది. 'దేశానికి గుర్తింపు తెచ్చే లక్షలాది యునిక్ డిజైన్స్‌ని పరిచయం చేయబోతున్న ఆనందంలో ఉన్నాను' అంటున్న శివాని నేత తన ప్రాజెక్ట్ విశేషాలను ఇలా మన ముందుంచింది..

''పరాగ అంటే పుప్పొడి – మంజరి అంటే డిజైన్. సంస్కృతం నుంచి తీసుకున్న ఈ పదాలను మా ప్రాజెక్టుకు పెట్టాం. బీఎస్సీ అగ్రికల్చర్ చేయాలనుకుని, కుదరక బోటనీ సబ్జెక్ట్ తీసుకున్నాను. ఉస్మానియా యూనివర్శిటీలో ఎమ్మెస్సీ బోటనీ చేస్తున్నాను. నాకు డ్రాయింగ్ కూడా తెలుసు అని మా బోటనీ ప్రొఫెసర్ విజయ భాస్కర్ రెడ్డి సర్ నాకు ఈ డిజైనింగ్ టాపిక్ ఇచ్చారు. దానిని ఇలా మీ ముందుకు తీసుకు రాగలిగాను.

**లక్షలాది మోడల్స్**

పరాగ రేణువులను రెండు విధాలుగా మైక్రోస్కోప్ చేశాను. లైట్ మైక్రోస్కోపీలో ఫ్లవర్ స్ట్రక్చర్, సెమ్(స్కానింగ్ ఎలక్ట్రానిక్ మైక్రోస్కోప్)లో పుప్పొడి రేణువులను స్కాన్ చేశాను. భూమిపైన లక్షలాది మొక్కలు, వాటి పువ్వులు వేటికవి భిన్నంగా ఉంటాయి. ఇక వాటిలోని పరాగ రేణువులు మరింత భిన్నంగా ఉంటాయి. మందార, వేప, తులసి, తిప్పతీగ, తుమ్మ, అర్జున, ఉల్లి పాయ, కాకర, ఆరెంజ్, జొన్న, మొక్క జొన్న, ఖర్జూరం, దోస పువ్వు... ఇలా దాదాపు 70 రకాల పుప్పొడి రేణువులను స్కాన్ చేసి, ఆ స్కెలిటిన్ నుంచి మోటిఫ్స్‌ను వెలుగులోకి తీసుకువచ్చాను. ఈ అందమైన పరాగ రేణువుల నుంచి మోటిఫ్స్ డిజైన్స్‌గా తీసుకు రావడానికి నాలుగు నెలల సమయం పట్టింది.

**పేటెంట్ హక్కు**

ఇప్పటి వరకు సాఫ్ట్‌వేర్‌లోనే టెక్స్‌టైల్ ప్యాటర్న్‌ని తీసుకున్నాను. క్లాత్ మీదకు తీసుకు వచ్చే ప్రయత్నం చేస్తున్నాను. మాది నేత కుటుంబమే. నేను చేసిన ఈ ప్రింట్స్ క్లాత్స్ మీదకు తీసుకురావచ్చని నిర్ధారణ చేసుకున్నాం. కాటన్, పట్టు, సీకో మెటీరియల్ మీదకు మోటిఫ్స్ ప్రింట్స్ చేయచ్చు. నేతలోనూ డిజైన్స్ తీసుకోవచ్చు. ఎంబ్రాయిడరీ కూడా చేయచ్చు. మేం ముందు టీ షర్ట్ పైన ప్రింటింగ్ ప్రయత్నం చేశాం. ఇంకా మిగతా వాటి మీదకు ప్రింట్స్ చేయాలంటే టెక్స్‌టైల్ ఇండస్ట్రీ మద్దతు అవసరం అవుతుంది. బ్లాక్ ప్రింట్ చేయాలన్నా .. అందుకు తగిన వనరులన్నీ సమకూర్చుకోవాల్సి ఉంటుంది. ముందుగా పేటెంట్ హక్కు పొందేవరకు వెళ్లింది. దీనిని ఒక స్టార్టప్‌గా త్వరలో ప్రారంభించాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయి.



శివాని నేత

**టెక్స్‌టైల్ రంగం మద్దతుతో...**

ప్రకృతిలో కళ్లకు కనిపించేవి లైట్ మైక్రోస్కోపిక్ ద్వారా నలభై వరకు పిక్చర్స్ తీసుకుంటే, స్టెమ్ ద్వారా మరికొన్ని సాధించాం. కంప్యూటర్‌లో వియానా దేశం నుంచి పోలెన్ గ్రెయిన్స్ స్కెలిటన్ స్ట్రక్చర్ నుంచి కొన్ని తీసుకున్నాం. మన దేశానికి వేల సంవత్సరాల నుంచి అద్భుతమైన టెక్స్‌టైల్ డిజైనింగ్ కల్చర్ ఉంది. కలంకారీ, ఇకత్ పోచం పల్లి, గొల్ల భామ, రాజస్థాన్‌లో బాందినీ, గుజరాతీలో లెహెరియా, కాశ్మీర్ ఎంబ్రాయిడరీ ఎప్పటి నుంచో ఉన్నాయి. అలాగే 'పరాగ మంజరి' మన దేశానికే వన్నె తెచ్చేలా తీసుకురావాలన్నది నా ప్రయత్నం. దీనిని తెలంగాణ ప్రభుత్వం టెక్స్‌టైల్ శాఖకు అందించి, వారి సపోర్ట్ తీసుకొని, ఈ వర్క్‌ను వెలుగులోకి తీసుకురావాలనుకుంటున్నాం'' అని శివాని నేత చిలుకూరి తెలియజేశారు.

– నిర్మలారెడ్డి,
'సాక్షి' ఫీచర్స్ ప్రతినిధి

**లక్ష ప్యాటర్న్స్**

ఒక్కో చెట్టు పువ్వుకు ఒక్కో ప్రత్యేకమైన పరాగ రేణువులు ఉంటాయి. ఈ పరాగ రేణువుల మోడల్స్ నుంచి కొన్ని లక్షల ప్యాటర్న్స్ టెక్స్‌టైల్ రంగంలోకి తీసుకురావచ్చు. వీటిని పట్టు, కాటన్, సిల్క్, బెడ్ షీట్స్.. ఇలా ప్రతి క్లాత్ మీదకు తీసుకురావచ్చు. ఈ ప్రాజెక్ట్ తయారు చేస్తున్నప్పుడు ప్రపంచంలో ఎవరైనా ఇలా చేశారా.. అని శోధించాను. కానీ, ఎక్కడా మాకు ఆ సమాచారం లభించలేదు. అందుకే, పేటెంట్ హక్కుల కోసం దరఖాస్తు చేశాం. ఈ ప్యాటర్న్స్ వస్త్ర డిజైన్ పరిశ్రమల్లో గణనీయమైన ప్రభావం చూపుతాయి.



– డాక్టర్ అల్లం విజయ భాస్కర్‌రెడ్డి,
అసోసియేట్ ప్రొఫెసర్,
బోటనీ డిపార్ట్‌మెంట్, ఉస్మానియా యూనివర్శిటీ



మన్నిదా బాను

## ప్రాణం నిలిపి

స్త్రీ శక్తి

మన్నిదా బాను మంగుళూరులోని కద్రి పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్. ఈమధ్యే కొత్తగా ఉద్యోగంలో చేరారు. అక్టోబర్ 23 తెల్లవారు జామున 3.40 కి ఆ స్టేషన్ కి కాల్ వచ్చింది. అక్కడికి దగ్గర్లోని పాలిటెక్నిక్ కాలేజీ సెంటర్లో పెద్ద ఆక్సిడెంట్ అయింది. పికప్ వెహికల్, కంటైనర్ ట్రక్కు ఢీ కొట్టుకున్నాయి. ఇదీ ఆ కాల్. వెంటనే మన్నిదా తన స్కూటీ పై ప్రమాద ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆమె వెళ్ళేటప్పటికి ఆ వాహనాలు తుక్కు తుక్కు అయి ఉన్నాయి. ఒక వ్యక్తి రక్తపు మడుగులో చావు బతుకుల మధ్య కొట్టుకుంటున్నాడు. ఆ రెండు వాహనాలలో ఒకదాని క్లీనర్ అతను. మన్నిదా అతడి పరిస్థితిని గమనించారు. ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా వెంటనే అతడిని అతి కష్టమ్మీద లేపి, తన స్కూటర్ పై నేరుగా ఆ దగ్గర్లోని ప్రైవేట్ ఆసుపత్రికి మోసుకెళ్లారు. అతడి ప్రాణాలని నిలబెట్టగలిగారు.

ఆమె టైమ్ సెన్స్, ఆమె వేగం, ఆమె ధైర్యం, ఆమెలోని కారుణ్యం, ఆమె యూనిఫామ్.. అన్నీ పంచభూతాల్లా ఒకటై ఆ వ్యక్తి ప్రాణాలను కాపాడాయనే అనుకోవాలి. అదే కనుక.. పోలీస్ కాకుండా ఒక మామూలు వ్యక్తి ఎవరైనా అంతలా గాయపడిన వారిని తీసుకెళితే ప్రైవేటు హాస్పిటల్స్ చేర్చుకుని ఉండేవా?! 'మేం అడ్మిట్ చేసుకోడానికి లేదు. ఇది పోలీస్ కేస్..' అని ఉండేవి.

'వాయు వేగంగా స్పందించి ఒకరి ప్రాణాన్ని నిలబెట్టిన కద్రి స్టేషన్ మహిళా పోలీస్ కానిస్టేబుల్ మన్నిదా బానుకు' అభినందనలు అంటూ తెల్లారగానే మంగుళూరు సిటీ పోలీస్ కమిషనర్ అనుపమ్ అగర్వాల్ ట్వీట్ పెట్టారు. మంగుళూరు ఈస్ట్ పోలీస్ స్టేషన్ నుంచి కూడా మన్నిదాకు ప్రశంసలు అందాయి.

డ్యూటీ మైండెడ్ మాత్రమే అయి ఉంటే ఘటనా స్థలానికి వెళ్ళగానే ఫార్మాలిటీస్ లో పడి ఉండేవారు మన్నిదా. కానీ ఆమె అలా చేయలేకపోయారు. ఆమెలోని మానవతా హృదయం.. ఉద్యోగ విధి విధానాలను దాటి మరీ స్పందించింది. అందుకు 'తగిన శిక్ష' ఏదైనా ఉందంటే.. అది ప్రమోషనో, ప్రశంసాపత్రమో తప్ప మరొకటి అవుతుందా?! మన్నిదా మాత్రం.. 'నేను చేసింది ఏముందీ..!' అని చిరునవ్వుతో అంటున్నారు.. తనపై కురుస్తున్న అభినందనల జల్లులలో తడిసి ముద్ద అవుతూ.



రీనా వర్గీస్

## ప్రాణాలకు తెగించి

సాహసాన్ని వెన్నెముకగా ధరించే వాళ్లకు అసాధ్యం ఉండదు. హై–రిస్క్ అనేది ఉండదు.

ఈ విషయాన్ని మరోసారి అక్షరాలా నిరూపించింది పైలట్ రీనా వర్గీస్. అడవిలో, అత్యంత ప్రతికూల పరిస్థితులలో ప్రాణాపాయంలో ఉన్న జవాన్‌ను ఆస్పత్రికి తరలించింది.

రీనా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన కొత్తలో... 2009లో సీనియర్ పోలీసు అధికారులను తీసుకు వెళుతున్న హెలికాప్టర్‌ను మావోయిస్టులు కూల్చివేశారు. తాను చేస్తున్న ఉద్యోగం ఎంత రిస్క్ అనేది అర్థం చేసుకోవడానికి ఆ సంఘటన రీనాకు ఉపయోగపడింది.

తాజా విషయానికి వస్తే...

మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో కమాండోలు, మావోయిస్టులకు మధ్య ఎనిమిది గంటల పాటు జరిగిన భీకరమైన ఎదురుకాల్పుల్లో ఒక కమాండో తీవ్రంగా గాయపడ్డాడు. మావోయిస్టుల రాకెట్ దాడులకు అవకాశం ఉన్న ఆ ప్రమాదకరమైన పరిస్థితుల్లో గాయపడిన కమాండోను అక్కడి నుంచి తరలించడం అంటే ప్రాణాలను పణంగా పెట్టడమే.

ఉన్నతాధికారుల నుంచి సమాచారాన్ని అందుకున్న రీనా వర్గీస్ తన ప్రాణాన్ని లెక్క చేయకుండా హన్స్ హెలికాప్టర్‌తో రంగంలోకి దిగింది. కో–పైలట్‌కు కమాండ్స్ అందజేసి ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశంలో హెలికాప్టర్‌ను వీలైనంత వరకు దించి కిందికి దూకింది.

తాడు సహాయంతో గాయపడిన కమాండోను హెలికాప్టర్‌లోకి తీసుకువచ్చింది. 30 నిమిషాలలో గడ్చిరోలికి అక్కడి నుండి నాగ్‌పూర్ తరలించింది. మూడు బుల్లెట్లు తగిలిన కమాండోకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

ఏరోనాటికల్ ఇంజినీరింగ్‌లో బి.టెక్ చేసిన రీనా వర్గీస్ గతంలో ఎన్నో ముఖ్యమైన రెస్క్యూ ఆపరేషన్‌లలో పాల్గొంది. కోవిడ్ మహమ్మారి సమయంలో బాధితులను లక్షద్వీప్ నుంచి కొచ్చికి తరలించే రెస్క్యూ ఆపరేషన్‌లలో చురుగ్గా పాల్గొని ప్రశంసలు అందుకుంది.

# తాళపత్ర కళ



బాల త్రిపుర సుందరి

అవసరం ఒక ఆవిష్కరణకు దారి వేసింది. ఆర్థిక అవసరాలే తనను హ్యాండీక్రాఫ్ట్ కళాకారిణిగా తీర్చిదిద్దాయని చెప్పారు బాల త్రిపుర సుందరి. తాటి ఆకులతో గృహోపకరణాలు, అలంకరణ వస్తువులు తయారు చేస్తారామె. వీటి తయారీలో మహిళలకు శిక్షణనిస్తారు కూడా. తాటి ఆకు కళారూపాల తయారీలో యాభై ఏళ్ల అనుభవం ఆమెది.



**ఒక నిర్ణయం జీవితాన్ని మార్చేసింది!**

త్రిపుర సుందరికి 75వ సంవత్సరం. ఆమెది తూర్పుగోదావరి జిల్లాలో ఓ కుగ్రామం. చదువుకు నోచుకోని త్రిపుర సుందరి 1972లో ముంబయికి వెళ్లి హస్తకళాకృతుల తయారీలో సర్టిఫికేట్ కోర్సు చేశారు. అక్కడ నేర్పించిన కళారూపాలతోపాటు తన క్రియేటివిటీతో మరి కొన్ని రూపాలను తయారు చేశారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో హస్తకళాకృతుల ఎగ్జిబిషన్‌లలో స్టాల్ పెట్టారు. ప్రస్తుతం హైదరాబాద్, నెక్లెస్ రోడ్, పీపుల్స్ ప్లాజాలో పామ్ క్రాఫ్ట్ కళాకృతులను ప్రదర్శిస్తున్నారు.



**పనిలోనే ఆనందం**

''మా ఊరిలో తెలిసిన వాళ్ల ద్వారా ముంబయిలో శిక్షణ కోర్సు గురించి తెలిసింది.. మూడు నెలల కోర్సు, బస భోజన వసతులు వాళ్లే ఏర్పాటు చేస్తారని చెప్పారు. చదువు లేదు, భాష ఇబ్బందవుతుందేమోనని భయంతోనే వెళ్లాను. కానీ అక్కడ తెలుగు వాళ్లు కూడా ఉండడంతో ఇబ్బంది కలగలేదు. క్రమంగా హిందీలో చెప్తున్న విషయాలు అర్థం కాసాగాయి. కోర్సు పూర్తయిన తర్వాత మా ఊరికి వచ్చి, నిడదవోలులో ఉన్న తాటిబెల్లం ఫెడరేషన్ లో ట్రైనర్‌గా ఉద్యోగంలో చేరాను. బదలీ మీద 1983లో హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌కి వచ్చాను. ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్‌తో కూడా పని చేశాను. ఆ ఉద్యోగం నుంచి రిటైర్ అయిన తర్వాత ఇప్పుడు కూకట్‌పల్లి, హౌసింగ్ బోర్డులో మా ఇంటి దగ్గర నాకు నచ్చిన కళారూపాలు అల్లుకుంటూ, ఎగ్జిబిషన్‌లలో స్టాల్ పెడుతున్నాను. వీటితోపాటు తుక్కుగూడలోని నీరా యూనిట్‌లో శిక్షణనిస్తున్నాను. బంధువులు, స్నేహితులు ఇంకా పని చేయడం ఎందుకని అడుగుతుంటారు. పిల్లల బాధ్యతలు పూర్తయ్యాయి, నేను పని చేయకపోతే అడిగేవాళ్లు కూడా లేరు. కానీ నాకు పని చేయకుండా కూర్చుని తినడం ఇష్టం ఉండదు. ఆరోగ్యం బాగున్నప్పుడు పని మానేయడం ఎందుకు?'' అంటూ స్టాల్‌లో ఆమె బొమ్మల ధరలు అడుగుతున్న వారికి బదులివ్వడంలో మునిగిపోయారామె.

– వీఎమ్ఆర్
ఫోటోలు: ఎస్ఎస్ ఠాకూర్



## సూజీ బ్రెడ్

హెల్దీ డైట్



**కావలసినవి:** బొంబాయి రవ్వ – ఒకటిన్నర కప్పులు; ఇన్‌స్టంట్ ఈస్ట్ – టీ స్పూన్; చక్కెర పొడి– టేబుల్ స్పూన్; ఉప్పు – పావు టీ స్పూన్; పాలు – 3 టేబుల్ స్పూన్‌లు; నీరు – అర కప్పు; నూనె – 2 టేబుల్ స్పూన్‌లు; వెన్న – టీ స్పూన్; సీడ్స్ – 3 టేబుల్ స్పూన్‌లు (బాదం పలుకులు, పిస్తా, గుమ్మడి గింజలు, డ్రైఫ్రూట్ చిప్స్ వంటివి).

**తయారీ**

- రవ్వను మిక్సీజార్‌లో మెత్తగా పొడి చేసి ఒక పాత్రలో వేయాలి. అందులో ఈస్ట్, చక్కెర పొడి, ఉప్పు వేసి కలపాలి.
- అందులో నీరు, పాలు, నూనె వేసి బీటర్‌తో బాగా కలిపి పది నిమిషాల సేపు పక్కన ఉంచాలి.
- అడుగు చదరంగా ఉన్న పాత్రకు వెన్న రాసి అందులో పై మిశ్రమాన్ని వేసి చపాతీల పిండిని కలిపినట్లు చేత్తో 15 నిమిషాల సేపు మర్దన చేయాలి. కొద్దిగా పిండిని తీసుకుని వేళ్లతో సాగదీస్తే పలచబడుతూ సాగాలి. అలా వచ్చే వరకు మర్దన చేసి వేరొక పెద్ద పాత్రకు వెన్న రాసి అందులో పెట్టి మూత పెట్టాలి. ఆ పాత్రను గంట సేపు వెచ్చని ప్రదేశంలో ఉంచాలి, పిండి రెండింతలవుతుంది.
- ఏడంగుళాలు, నాలుగు అంగుళాల కొలతల లోఫ్ పాన్‌కు వెన్న రాసి అందులో బ్రెడ్ పిండిని పెట్టి అర గంట సేపు కదిలించకుండా ఉంచాలి. ఈ కొలతలతో చేసిన పిండి పాన్‌లో సగానికి మాత్రమే వస్తుంది. అరగంట సేపటికి పిండి పరిమాణం రెండింతలవుతుంది. ఆ మిశ్రమం లోఫ్ పాన్‌లో పూర్తిగా అమరే లోపు పిండి మీద పాలను అద్ది ఆ పైన బాదం ఇతర గింజలను చల్లాలి.
- ఈ లోపు ప్రెషర్ కుకర్‌ను వేడి చేయాలి. లోఫ్ పాన్‌ను కుకర్‌లో అమర్చిన తర్వాత మూతపెట్టి 25 నిమిషాల సేపు చిన్న మంట మీద ఉంచాలి.



డాక్టర్ కరుణ
న్యూట్రిషనిస్ట్ అండ్ వెల్‌నెస్ కోచ్

## ఒంటె బుక్ చేయాలి ఓటీపీ నంబర్ ఎంత?

ఊబర్, ఓలాలో
ఆటోనో స్కూటరో కారో
బుక్ చేయొచ్చు. వస్తుంది.
కాని ఒంటెను బుక్ చేయొచ్చా?
దుబాయ్‌లో ఇద్దరు ఆడవాళ్లు
ఎడారిలో తప్పిపోయారు.
ఊబర్‌లో వెతికి ఒంటెను బుక్ చేశారు.
ఒంటె ఐదు నిమిషాల్లో వచ్చింది. ఎక్కారు.
ఇంటర్‌నెట్‌లో సరదా దుమారం రేపుతున్న
ఈ కథనం వెనుక యదార్థం ఏమిటి?



పల్లెటూరులో ఉన్నప్పుడు ఎడ్లబండి, నది ఒడ్డున పడవ, అడవిలో ఏనుగు, కొండ దారిలో గాడిద, ఎడారిలో ఒంటె ఇలా ఊబర్ ద్వారానో ఓలా ద్వారానో బుక్ చేసే వీలుంటే ఎంత బాగుంటుంది? ఏమో ఆ రోజులు కూడా వస్తాయేమో. రెండు రోజుల క్రితం అలాంటి విషయాన్నే చూపి లోకాన్నంతా ఆకట్టుకుంది ఒక వీడియో. దుబాయ్‌లో ఇద్దరు మహిళలు 'మేము ఎడారిలో తప్పిపోయాం. ఊబర్‌లో ఒంటె ఉందేమో చూద్దాం' అని ఫోన్‌ని స్క్రోల్ చేస్తే ఒంటెను బుక్ చేసే ఆప్షన్ ఊబర్‌లో కనిపించింది. వారిలోని ఒక మహిళ ఒంటెను బుక్ చేయగానే దీపక్ అనే వ్యక్తి ఐదు నిమిషాల్లో ఒంటెతో ప్రత్యక్షమయ్యాడు. ఇంకేముంది... ఆ మహిళల ఆనందానికి హద్దే లేదు. వారిలో ఒకామె ఒంటెనెక్కి 'ఇది భలే ఉంది' అనుకుంటూ ఇంటిదారి పట్టింది. ఈ వీడియో ఇంటర్‌నెట్‌లో రాగానే లక్ష లైకులు సంపాదించుకుంది. సరదా వ్యాఖ్యల్ని కూడా. 'ఓటీపీ నంబర్ ఎంత?', 'దుబాయ్‌లో అంతే', 'నంబర్ ప్లేట్ ఎక్కడ'... ఇలా. నిజానికి ఇది నిజంగా జరగలేదు. 'జెట్‌సెట్ దుబాయ్' అనే ట్రావెల్ సంస్థ ఊబర్‌తో కలిసి చేసిన ప్రమోషనల్ వీడియో. దుబాయ్‌లో అయినా సరే ఊబర్ ఒంటె సర్వీస్‌ను ఇవ్వదు. కాని 'ఏటీవీ' (ఆల్ టెర్రయిన్ వెహికిల్)ను బుక్ చేసుకోవచ్చు. దుబాయ్‌లో ఊబర్ బ్లాక్ (హైఎండ్ కార్లు), గ్రీన్ (ఎలక్ట్రిక్ కార్లు), ఎల్‌యుఎక్స్ (లగ్జరీ కార్లు) రైడ్‌కు పంపుతుంది. మొత్తం మీద ఈ యాడ్ కొత్త ఆలోచనలు రేకెత్తించింది. కార్లు, బైక్‌లు, ఆటోలకు ఉన్న ఇలాంటి సర్వీసులు ఇకపై ప్రాంతాన్ని బట్టి మారితే బాగుండనిపించింది.

బ్యూటిప్స్

## మెరిసే మేని ఛాయను కాపాడుకోవాలంటే..



- తక్షణ తాజాదనం కోసం రోజ్ వాటర్ లేదా దోసకాయ రసంతో మేనికి మర్దనా చేసి, ఆరిన తర్వాత శుభ్రపరుచుకోవాలి.
- పచ్చి పాలను కాటన్ బాల్‌తో అద్దుకొని, ముఖానికి రాయాలి. 10 నిమిషాల పాటు అలాగే ఉంచి కడిగేయాలి. పాలలో లాక్టిక్ యాసిడ్ ఉంటుంది, ఇది చర్మాన్ని సున్నితంగా ఉంచడంతో పాటు శుభ్రపరుస్తుంది.
- చర్మంపై నుంచి సహజ నూనెలను పోకుండా ఉండటానికి చర్మతత్వానికి సరిపోయే తేలికపాటి, క్లెన్సర్‌ని ఉపయోగించాలి.
- ఓట్‌మీల్‌లో తేనె, కొద్దిగా నీళ్లతో కలిపి పేస్ట్ చేయాలి. మృత చర్మ కణాలను తొలగించడానికి, పోర్స్‌ను శుభ్రం చేయడానికి సున్నితంగా స్క్రబ్ చేయాలి.
- ప్రతిరోజూ కలబంద జెల్‌ను రాసి, మృదువుగా మర్దనా చేయాలి. దీని వల్ల చర్మం నునుపుగా, తేమగా ఉంటుంది.
- టేబుల్ స్పూన్ తేనెను, టేబుల్ స్పూన్ పెరుగుతో కలపాలి. దీన్ని ముఖానికి అప్లై చేసి, 15 నిమిషాల పాటు అలాగే ఉంచాలి. గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఈ మాస్క్ చర్మాన్ని కాంతిమంతం చేస్తుంది.
- సగం అరటిపండును మెత్తగా చేసి, టీస్పూన్ తేనెతో కలపాలి. చర్మం మృదువుగా, మెరుస్తూ ఉంటుంది.
- కొద్దిగా గ్రీన్ టీని కాచి, చల్లబరచాలి. ఈ నీటిని దూదితో అద్దుకుంటూ, మేనికి పట్టించాలి. ఎండకు కమిలిన చర్మం తాజాగా మారుతుంది.